క్లుప్తంగా

నేటితో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ముగింపు


ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈ నెల 9వ తేదీతో ముగుస్తుందని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగులందరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకోవాలని చెప్పారు. ఇదే చివరి అవకాశం అని ఆయన వెల్లడించారు.

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం బీఎన్‌ఆర్ పేట ప్రభుత్వ ఐటీఐలో పలు కోర్సులకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబమూర్తి తెలిపారు. ఇందుకు 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 18వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డొనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సేవ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో రమేష్, నాగరాజు, సహదేవనాయుడు తదితరలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ఐరాల: పిడుగుపడి ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కామినాయనపల్లెకు చెందిన పాడి రైతు సుధాకర్‌నాయుడు తన పాడి ఆవును వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు కట్టేశాడు. గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆసమయంలో పిడుగుపడి పాడిఆవు మృతిచెందింది. విలువ రూ.75 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

టీడీపీ వేధింపులు తాళలేక రాజీనామా


ఎంపీడీఓ మోహన్‌మురళికి రాజీనామా పత్రం అందిస్తున్న వలంటీర్లు

శ్రీరంగరాజపురం: మండలంలోని ముద్దుకుప్పం సచివాలయ పరిధిలోని వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న కే.సురేష్, టి.విజయ్, టి.రెడ్డెప్ప, టి.ఆనంద్‌రాజ్, వి.రామ్మూర్తి తన విధులకు రాజీనామా చేశారు. బుధవారం ఈ మేరకు మండల అభివృద్ధి అధికారి మోహన్ మురళికి రాజీనామా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నానని, టీడీపీ నాయకుల వేధింపులు కారణంగా మనస్తాపానికి గురై రాజీనామా చేశామని తెలిపారు.

14 నుంచి తిరుపతి గంగజాతర

- రాష్ట్ర పండుగకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌తోపాటు డీఆర్వో పెంచల కిషోర్‌ను సమన్వయం చేసుకుని ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా జాతర సందర్భంగా శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జాతర ముగింపు రోజు భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు.

జాతర మహోత్సవ వివరాలు

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా మే 14 మంగళవారం చాటింపు, 15న బైరాగి వేషం, 16న బండ వేషం, 17న తోటి వేషం, 18న దొర వేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండలు, 21న గంగమ్మకు చప్పరం, 22న విశ్వరూప దర్శనం ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు.దేవదాయ శాఖ మల్టీజోన్–2 రీజనల్ జాయింట్ కమిషనర్ ఎండోమెంట్స్ ఎస్‌వీఎస్‌ఎస్.మూర్తి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓ మమత తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ఊడ్చి పారేస్తాం

- ప్రశాంత చిత్తూరుకు నాదీ హామీ!
- శాశ్వత నీటి సమస్య పరిష్కారమే ప్రధాన అజెండా
- చంద్రబాబు హయాంలోనే నాపై తప్పుడు కేసులు
- కరోనాటైంలో ఈ పారాచూట్ నాయకులు ఏమయ్యారు?
- 'సాక్షి'తో చిత్తూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి


గోవుకు అరటిపండు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



చిత్తూరు అర్బన్: పార్టీ కోసం ఓ సాధారణ కార్యకర్త కష్టపడితే ఎలాంటి గుర్తింపు వస్తుందనడానికి ఈయనే నిదర్శనం. ప్రజా సేవ చేయడానికి పదవులు అవసరంలేదని నిరూపించారు. రూ.కోట్లకు కోట్లు ప్రజల కోసం నీళ్లలాగా ఖర్చుచేసిన వ్యక్తి, అధికారంలోకి వస్తే అవినీతిని ఊడ్చిపారేస్తామని గట్టిగా చెబుతున్నారు. హత్యారాజకీయాలకు పెట్టిందిపేరుగా ఉన్న టీడీపీతో రౌడీలు, గూండాలు జతకట్టినా తన గెలుపును ఆపలేరని ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఆయనే చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంసి.విజయానందరెడ్డి. చిత్తూరు ప్రజలు ఎందుకు తనను నమ్మాలి..? ఇప్పటి వరకు ప్రజలకు ఏం చేశారు..? గెలిస్తే ప్రజలకు ఏం చేస్తారు..? అనే విషయాలపై విజయానందరెడ్డి 'సాక్షి'తో పంచుకున్న వివరాలు ఆయన మాటల్లోనే..

- చిత్తూరులో గత పాలకులు చేసిన రౌడీయిజం కారణంగా పంక్చర్ షాపు పెట్టాలన్నా కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉండేది. గత ఐదేళ్లలో అలా కాదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తూరు కేంద్రంగా ఎన్ని కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్ వచ్చాయో ప్రజలకు తెలుసు. స్వచ్ఛందంగా పెట్టుబడులు పెట్టి, ఎవ్వరికీ ఒక్క రూపాయి మామూళ్లు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు చేసుకోవడానికి సకల సదుపాయాలు కల్పిస్తా.
- పార్టీలో నేను ఓ సాధారణ కార్యకర్తగా, జగనన్న ఆశయంతో మార్కెట్‌గేటును అయిదేళ్లు ఉచితం చేశాను. మహిళలకు కానుకలు, ఉగాది–రంజాన్ కానుకల పేరిట ప్రతి ఇంటికీ నిత్యావసర వస్తువులు ఇచ్చాను. రంజాన్ తోఫాలు, క్రైస్తవులకు అండగా నిలిచి సేవ చేశాను. వాటర్ ప్లాంట్లు, ఉచిత వాటర్ ట్యాంకులు, మృతదేహాలు తీసుకెళ్లడానికి ఉచిత ఫ్రీజర్లు, వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉంచాను. రోజుకు 600 మందికి జగనన్న క్యాంటీన్ పేరిట అన్నదానం చేస్తున్నాను. కొత్తపల్లె మిట్టలో ఐటీ కంపెనీ పెట్టించాను. త్వరలోనే ఇది ప్రారంభిస్తాం. యువత బెంగళూరు, చెన్నై నగరాలకు పోకుండా ఇక్కడే ఐటీ కంపెనీలో పనిచేసేలా సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమను తీసుకొచ్చాం.
- చిత్తూరులో వ్యాపారులను మోసం చేసి, పారిపోయిన వ్యక్తి, పారాచూట్ నుంచి ఊడిపడ్డట్టు ఇపుడు వచ్చి నేను మీకు మంచి చేస్తాను, చిత్తూరును అభివృద్ధి చేస్తాను అంటే నమ్మే పరిస్థితిలో ప్రజలులేరు. సోషల్ మీడియాలో రీల్స్ స్థాయి అతనిది. దళిత మహిళలపై అహంకారాన్ని చూపించే వ్యక్తి గురించి మాట్లాడటం వేస్ట్. టీడీపీ అంటేనే చిత్తూరులో హత్యా రాజకీయాలకు పరాకాష్ట. ప్రజలకు ప్రశాంత జీవనం కల్పించడం నా అజెండాలోని ప్రధాన అంశం. ప్రజలు కరోనా లాంటి కష్టకాలంలో ఉన్నపుడు ఒక్క టీడీపీ నాయకుడు కూడా పలకలేదే..?
- ప్రతిపక్షం నన్ను స్మగ్లర్ అని అంటోంది. 2012లో నాకున్న ముప్పు దృష్ట్యా గన్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నా. అపుడు పోలీసు శాఖ నాపై ఒక్క కేసు కూడా లేదని ఎన్‌వోసీ ఇచ్చింది. 2014లో జరిగిన ఎన్నికల్లో నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జనరల్ ఏజెంట్. ఒక్క కేసు ఉన్నా, ఏజెంట్‌గా నిరాకరిస్తారు. ఎలాంటి కేసులు లేదని పోలీసులే క్లీన్‌చిట్ ఇచ్చారు. ఎన్నికల తరువాత నాలుగు నెలల్లో నాపై కేసుల పరంపర కురిపించింది చంద్రబాబు ప్రభుత్వమే. నేను సవాల్ విసురుతున్నా, ఎక్కడైనా ఒక్కచోటైనా నన్ను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారా? ఎవరో దొంగచేత బలవంతంగా కన్‌ఫెక్షన్ స్టేట్‌మెంట్ (నేర అంగీకార పత్రం) ఇప్పించి నాపై తప్పుడు కేసులు పెట్టారు. చట్టంలో కన్‌ఫెక్షన్ స్టేట్‌మెంట్ ఆమోదయోగ్యమైనది కాదు.
- నేను చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తూరులో శాశ్వతంగా నీటి సమస్య తీర్చడానికి అడవిపల్లె రిజర్వాయర్‌ను పూర్తి చేయిస్తాం. ఔటర్ రింగురోడ్డు, ఇంటర్ రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేయడంతోపాటు గ్రానైట్ ఫ్యాక్టరీ యాజమాన్యాల కష్టాలను తీర్చడానికి ప్రయత్నిస్తాం. ఇక ప్రతీ ఆదివారం ఉదయం రెండు గంటల పాటు మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయాలని సంకల్పించుకున్నాను. ఊరిని బాగు చేయాలంటే, ముందు నాయకుడి నుంచే ప్రారంభం కావాలి. దీనికి మేధావులు, ఇతర వర్గాలు నాకు మద్దతుగా నిలిచాయి. స్వచ్ఛందంగా వాళ్లు కూడా పనులు చేస్తామన్నారు. ఇది ఓ మార్పును తీసుకొస్తుందని భావిస్తున్నా. చిత్తూరులోని చెత్తతోపాటు అవినీతి, అక్రమాలను ఊడ్చి పారేస్తా.
- మా క్యాంపెయిన్ స్టార్లు వైఎస్ జగన్, మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిత్తూరు ప్రజలే. ఇంకెవరూ మాకొద్దు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతి కుటుంబం మాకు అండగా నిలుస్తుందని బలంగా నమ్ముతున్నాను. నిస్వార్థమైన నా సేవా కార్యక్రమాలు గెలిపిస్తాయని భావిస్తున్నాను.

రచ్చబండ

ఇట్లుంటే ఇంకెట్లా నాయినా!



రేయ్ యాడికి రా పోయినావ్..వాళ్ల పెచారానికి వచ్చుండారని పోయినా నాయినా..వాళ్లొస్తే.. ఆడా నీకేం పనిరా..?..లేదు నాయినా..వాళ్ల (వైఎస్సార్‌సీపీ) పెచారానికి జనం ఎంతమందొస్తాండారని పోయింటి.. బాగా దండిగా వచ్చినారు.. మరి మనోళ్లు రాలేదా..? నిన్న దినం వచ్చి పోయినారుగానీ పది మంది కూడా రాలా..బగిసేటుగా ఉంది. ఇది ఆ పార్టీ వోళ్లు చూసి పుల్లుగా నవ్వుకుంటాండారు. నాకు వోళ్ల మీద కోపం గొంతుకాడికి ఉంది నాయినా..ఏమిరావాళ్లు గెలుస్తారా..? నువ్ పోయి చూడా నాయినా! వాళ్ల ఎనకాల జనం ఎట్టాపోతుండారో.. మనం పిలిస్తే..పదిమంది రానంటుంటే.! ఏమి చూస్కోని అట్లా పోతాండార్రా వాళ్ల ఎనకాల?.. ఈ ఐదేండ్లుగా ఇంటి కాడికే పోయి అది ఇదీ చేసినారు. ఇండ్లకాడే తిరుగుతా ఉండారు. వలంటీర్లు అన్ని పనులు చేసి పెట్టినారు. ఇప్పుడు వాళ్లని ఇండ్ల పక్కకు రాకుండా చేసింది మన పార్టీనేనని ముసలీ ముతకా అంతా తిట్టాండారు..శాపనార్థాలు పెట్టాండారు..పింఛన్ల కోసం బ్యాంకుల కాడికిబోయి ఎన్ని అగసాట్లు పణ్నారో మనమూ చూస్తిమి కదా..ఇట్లుంటే ఇంకెట్లా నాయినా? పోటాపోటీగా ఎన్నికల బరిలోని పార్టీలు చేస్తున్న ప్రచారాలు ఆసక్తికర చర్చలకు తావిస్తున్నాయి. కాణిపాకంలో ఓ దుకాణం వద్ద ఇద్దరు తండ్రీ కొడుకుల మధ్య సాగిన సంభాషణ ఇది.

– కాణిపాకం

కాణిపాకానికి పాదయాత్ర


చిత్తూరు నుంచి కాణిపాకానికి ర్యాలీగా వెళుతున్న నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో బుధవారం కాణిపాకానికి పాదయాత్ర చేశారు. నగరంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి యాత్రను ప్రారంభించారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, పార్టీ బీసీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు యాత్రను జెండా ఊపి మొదలుపెట్టారు. హైరోడ్డు, కోర్టు డౌన్, సంతపేట మీదుగా కాణిపాకానికి వెళ్లారు. బలహీనవర్గాలకు పదవుల్లో, పనుల్లో వైఎస్సార్ సీపీ ప్రాధాన్యతనిస్తోందని జ్ఞానజగదీష్ తెలిపారు. పలు రంగాలకు సంక్షేమం అందించిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి నాయకత్వంలో జిల్లా క్లీన్ స్లీప్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగనన్న స్ఫూర్తితో చిత్తూరులో విజయానందరెడ్డి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు.


గాంధీ విగ్రహానికి నివాళి అర్పించిన జ్ఞానజగదీష్

దోచుకోవడమే టీడీపీ అజెండా

- టీడీపీకి ఓటేస్తే జన్మభూమి కమిటీలొస్తాయి
- ఫ్యానుకు ఓటేస్తే పథకాలన్నీ ఇంటికొస్తాయి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దోపిడీయే టీడీపీ ప్రధాన అజెండా అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి అన్నారు. చిత్తూరు మండలం దిగువ మాసాపల్లి పంచాయతీలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన తొలుత ఆలయంలో పూజలు చేశారు. తర్వాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మట్టి దోపిడీని ఎంచుకుని కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. పంట సంజీవనితో ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశారన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ పథకాల పంపిణీకి లంచం వసూలు చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. టీడీపీకి ఓటేస్తే ప్రతి పనికీ ప్రజలను పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు మళ్లీ కోరలు చాస్తాయని చెప్పారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పథకాల మంజూరు పారదర్శకంగా మారిందన్నారు. సచివాలయంలో అర్జీ పెట్టుకుంటే పథకాలు ఇంటికే వస్తున్నాయని స్పష్టం చేశారు. ఇందులో దళారుల జోక్యం అస్సలు లేదన్నారు. ఇలాంటి సుపరిపాలన అందించే ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు అమరనాథ్ రెడ్డి, రాబర్ట్, దిలీప్ రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, రఘు, ప్రభ, సుబ్రమణ్యం, గణేష్, ప్రభాకర్, ఆనంద్, గజపతి, చిరంజీవి, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నాయకుల ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాను గుర్తుకు ఓటువేసి గెలిపించాలని నగరంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. స్థానిక 39వ డివిజన్‌లో మేయర్ అముద ఇంటింటికీ వెళ్లి జగనన్నకు ఓటేస్తే పథకాలు ఇంటికే వస్తాయని, చంద్రబాబుకు ఓటేస్తే సంక్షోభం వస్తుందని చెప్పారు. ఓటేసే ముందు జగనన్న ప్రతి గడపకు పంపించిన పథకాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమం చూసి ఓర్వలేని చంద్రబాబు అధికారంలో వస్తే పాలన దారుణంగా ఉంటుందన్నారు. 42వ డివిజన్ నాయకులు కెప్టెన్ శివ, 50వ డివిజన్‌లో టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ సహదేవన్, నాయకులు జయగణేష్ ప్రచారం చేశారు.




42వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం, 39వ డివిజన్‌లో మేయర్ అముద ప్రచారం, 50వ డివిజన్‌లో ఓటడుగుతున్న నాయకులు

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో 2024–25 సంవత్సరానికి గానూ మొదటి విడత అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భైరవుడు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఐటీఐలో కోపా(కంప్యూటర్ కోర్సు), డ్రస్ మేకింగ్(టైలరింగ్), మెకానికల్ డీజిల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్10న సాయంత్రం 5 గంటలలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు జూన్18 నుంచి 26 వరకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 95337 23022, 95333 94950 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పింఛన్ ఇంటికే వచ్చెన్

- అవ్వాతాతలకు పింఛన్ పెంచి ఆదుకున్న ప్రభుత్వం
- రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంపుదల
- ఆనందంలో సామాజిక పింఛన్ దారులు


గుడిపాలలో లబ్ధిదారునికి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్

చిత్తూరు అగ్రికల్చర్: సామాజిక పింఛన్‌దారులకు ఇచ్చిన మాట ప్రకారం పూర్తి స్థాయిలో పింఛన్ కానుక మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంపుదల చేసింది. దీంతో గతంలో రూ.2 వేల వరకు మాత్రమే పింఛన్ అందుకునే అవ్వా తాతలు ప్రస్తుతం రూ.3 వేల వరకు అందుకుంటున్నారు. దీంతో సామాజిక పింఛను దారులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 28,329 మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు. అందులో వృద్ధులు 14,174 మంది, చేనేత కార్మికులు 45 మంది, దివ్యాంగులు 4,146 మంది, వితంతువులు 7,448 మంది, కల్లుగీత కార్మికులు 10 మంది, అభయహస్తం 881 మంది, ట్రాన్స్‌జెండర్స్ 14 మంది, మత్స్యకారులు 4 మంది, ఒంటరి మహిళ 779 మంది, చర్మకారులు 46 మంది, డప్పుకళాకారులు 394 మంది, కళాకారులు ఇద్దరు, సైనిక వెల్ఫేర్ 39 మంది, కిడ్నీబాధితులు 71 మంది, దీర్ఘకాలిక రోగులు 276 మంది ఉన్నారు. అందులో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పుకళాకారులు తదితరులకు గతంలో రూ. 2 వేల వరకు మాత్రమే పింఛను మంజూరయ్యేది. అయితే వారందరికీ ఇప్పుడు రూ.3 వేల అందిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి లబ్ధిదారునికి 2021 నుంచి ఏటా రూ.250 చొప్పున పెంపుదల చేసి ఈ ఏడాది జనవరికి పూర్తి స్థాయిలో రూ.3 వేల వరకు పెంపుదల చేసి అందిస్తోంది.

ఠంఛన్‌గా పింఛన్

నియోజకవర్గ పరిధిలోని సామాజిక పింఛనుదారులకు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఠంచనుగా పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకనే వలంటీర్ల సహకారంతో పింఛన్లను లబ్ధిదారులకు అందించి ఆదుకున్నారు. అదేగాక అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు కూడా నేరుగా పింఛన్లను అందించే ప్రక్రియను చేపట్టారు. దీంతో సామాజిక పింఛను దారుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

గతంలో అవస్థలే!

గత ప్రభుత్వ హయాంలో సామాజిక పింఛనుదారులకు ప్రతి నెలా అవస్థలు తప్పేవి కావు. అప్పట్లో పింఛను అందుకోవాలంటే ఆయా పంచాయతీ పరిధిలోని అధికారులు సూచించిన ఓ నిర్దిష్ట ప్రదేశంలోకి లబ్ధిదారులు చేరుకోవాలి. దీంతో నడవలేని వృద్ధులు, దివ్యాంగులు కిలోమీటర్ల మేరకు అవస్థలు పడి చేరినా సకాలంలో పింఛను చేతికందేది కాదు. రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సిన దుస్థితి. ఇచ్చే పింఛను మొత్తాల్లో ఆటో చార్జీలు, ఇతర ఖర్చులకు తడిసి మోపుడయ్యేది.

జగన్ వల్లనే ఆనందంగా ఉన్నాం



మాలాంటి వృద్ధులు జగన్ వల్లే ఎంతో ఆనందంగా ఉన్నాం. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాలను రూ.3 వేల వరకు పెంపుదల చేసి ఆదుకున్నారు. ప్రతి నెలా తెల్లవారే సమయానికే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తాలను అందించి ఆదుకున్నారు. దీంతో మేము ఎప్పటికప్పుడు కావల్సిన మందులు, మాత్రలు కొనుగోలు చేసుకోవడం, నెల అవసరాలకు ఎవరిపైనా ఆధార పడకుండా ఖర్చు పెట్టుకోగలుగుతున్నాం. మమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకున్న జగన్‌కే ఈ సారి మా ఓటు వేస్తాం.

–కస్తూరి, వృద్ధురాలు, గుడిపాల మండలం

ధీమాగా బతుకుతున్నాం



ప్రతి నెలా అందించే పింఛన్ మొత్తాలతో మాలాంటి వృద్ధులు ఎంతో ధీమాగా బతుకుతున్నాం. గతం ప్రభుత్వ హయాంలో పింఛను తీసుకోవాలంటే ప్రతి నెలా కిలో మీటర్ల మేరకు నడుచుకుని పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే ఒకటో తేదీన పింఛను మొత్తాలను అందించి ఆదుకున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు కూడా నేరుగా పింఛను అందించి ఆదుకున్నారు.

–అమావాస్య వడియార్, వృద్ధుడు, గుడిపాల

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

పూతలపట్టు: నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల నిర్వహణల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వినియోగించుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం 108 మంది ఉద్యోగులు, 24 మంది హోం ఓటింగ్ ద్వారా ఓటుని వినియోగించుకున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని ఆర్వో చిన్నయ్య తెలిపారు.

రేపటి నుంచి అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో ఈ నెల 10వ తేదీ శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు శ్రీభగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీభగవద్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సులు, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి రోజు 10వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు తిరుమల శ్రీపెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో శ్రీరామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాథన్ శ్రీరామానుజ వైభవంపై ఉపన్యసిస్తారు. తర్వాత తిరుపతికి చెందిన రేవతి బృందం భక్తి సంగీత కార్యక్రమం చేపట్టనున్నారు.